విమర్శలేశము

ఎలవర్తి రోశయ్య

విమర్శమనఁగానే తప్పులు వెదకి తిట్టిపోయుట యని యపోహపడువారీ యిరువదవ శతాబ్దములోఁ గూడ ననేకు లున్నారు. కవిత్వము వ్రాయలేనివారే విమర్శకు లౌదురనియు, విమర్శకులందఱుఁ గఠినాత్ము లనియుఁ గొందఱు దలఁతురు. 'ఇది మంచిది, యిది చెడ్డది' యని జడ్జివలె తీర్పుచెప్పుట విమర్శకునిపని కాదనియుఁ, దానుచదివిన యుత్తమకావ్యములు తన్నెట్లా నందపూరితుని జేసెనో లోకమునకుఁ దెలియఁజేయుటే విమర్శక కృత్యమనియు మఱికొందఱి యాశయము. ఒక కావ్యములో గుణము లెక్కువగా నుండి దోషములు తక్కువగా నున్నచో నాకవిని గొనియాడవలెనని, దోషములే యెక్కువగానున్నచో మందలింపవలె నని కొందఱు బుద్ధిమంతు లందురు. సహృదయత్వముతో నే విషయమునైన మంచిదనియో చెడ్డదనియో చెప్పి యానిర్ణయమున కాధారములైన కారణములు దెలుపుటయే విమర్శనోద్దేశమని నాయభిప్రాయము. కాని కొలతబద్ద విమర్శనము సరియైనవిమర్శనము గాదు. ఒక కవియెడఁ దనకున్న స్నేహమును, ద్వేషమును బురస్కరించుకొని యతని కావ్యమును విమర్శకుఁ డనుచితముగా స్తుతించినను, గర్హించినను అతనిది సద్విమర్శనమని యనిపించుకొనదు. ఇది పలువురకుఁ దెలియును. వారిలో నూటిలోఁ దొంబదిమంది యీదోషమునకుఁ బాల్పడుచున్నారు. అతిస్తోత్రపరాయణులును, పురోభాగులును దుర్విమర్శకు లనఁబడుదురు గావున నే నీజాడ్యము వాతఁ బడకుండుటకుఁ బ్రయత్నించెదను. విమర్శమును గూర్చి వ్రాయవలెననిన నొకపెద్దగ్రంథ మగును గాన ప్రస్తుత మీ సాధారణసిద్ధాంతములతోఁ దృప్తిచెంది గ్రంథ విమర్శన మారంభించుచున్నాను. నేను విద్యార్థిని, సాహిత్య ప్రియుఁడను, సత్యరతుఁడను గావున సాహిత్యభూషణ శ్రీయుత జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, ఎం. ఏ., బి. ఎల్. గారు విరచించిన "విద్యార్థప్రకాశిక"ను, "సాహిత్యతత్త్వ విమర్శనము"ను యథాశక్తిఁ బరామర్శింతును.

విద్యార్థప్రకాశిక

ఇది యాంధ్రవిశ్వవిద్యాలయములో ౧౯౩౯, ౧౯౪౦ సం॥ల యింటర్మీడియేటు పరీక్షలకుఁ బాఠ్యగ్రంథము. ఇందుఁ బెక్కు శీర్షికలతో ననేకాంశములు వ్రాయఁబడియున్నవి.

"తమోదీపిక" యను వ్యాసములో, సరిగా నాలోచింపకుండ నుపనిషన్మతమును, భారత నాగరకతను దూలనాడరాదని చెప్పఁబడినది. "విజ్ఞానయాత్ర" యను వ్యాసములో, "తందానతాన బ్రదుకు" నీచమనియు, నందఱును దమకుఁ దాము బాగుగా విమర్శించుకొనవలె ననియు, భారత స్త్రీ మహత్త్వము కీర్తనీయమనియుఁ దెలుపఁబడినది. "ప్రాచీనుల యాశయము"లోఁ బాశ్చాత్యుల నాగరకత విద్దూరమనియుఁ, బాశ్చాత్య విద్యావిధానమున నాంతరంగిక దృష్టి లేదనియుఁ, బ్రాచీన భారతీయ విజ్ఞానము కట్టలు లేనిదనియు, ననంతమైన దనియు, శాశ్వతమనియు వ్రాయఁబడినది. తదితరవ్యాసములలో విజ్ఞానమును గూర్చియు నేటి విశ్వవిద్యాలయములు చెప్పెడు చదువు మనకెక్కువ యుపయోగకరము గాదనియు, మాతృభాష ప్రోత్సహింపఁబడవలె ననియు, సంధానుకరణము పనికిరాదనియుఁ దెలుపఁబడినది. మందంజ వేసిన శ్రీ గిడుగు రామమూర్తి పంతులవారి కృషి యమోఘమనియు, వారి భాషాతత్త్వపాండిత్య మపార మనియు, నీవఱకు వ్రాయఁబడిన తెలుఁగు వ్యాకరణములు బహువిద్యార్థ

లకు దుర్బోధములై దాదాపు నిరుపయోగములుగా నున్న వనియుఁ దెలిపి, స్త్రీ విద్యావశ్యకతను గూర్చి గ్రంథకర్తగారు మిగుల శ్రద్ధ వహించి విశేషముగా వ్రాసినారు.

మొత్తముమీఁద గ్రంథము చదువరుల జాతీయ భావములను, విద్యాపరత్వమును, సౌశీల్యమును పెంపొందింపఁ గలదని నా నమ్మకము.

ఈగ్రంథములో దోషములు గూడఁ గొన్ని యున్నవి. అనుచితస్థలములందుఁ గూడ వ్యక్తుల ప్రతిభావిశేషము లత్యుక్తులతో వర్ణింపఁబడినవి. రచన మితిమించి Allusive గా నుండి ధారళముగను, సహజముగను లేక యొగుడుదిగుడై, "యాతచ్ఛ"యని చెప్పుటకు వీలులేక, "పీనిబాన వేఱు" అన్నట్లున్నది. కొన్నిచోట్లఁ జెప్పినదే మరలఁ జెప్పఁబడెను. మఱి కొన్నిచోట్ల నయోమయత్వ మగపడుచున్నది. గోటితోఁ బోవుదానికి గొడ్డలి దెచ్చినట్లు, కొలఁదిపుటలకు సరిపోవు విషయములతో ౨౮౦ పుటల గ్రంథము చేయఁబడినది. చూడఁగా, కర్తగారి కింగ్లీషు, బెంగాలి, పాళీ మొదలగు కొన్నిభాషలలో విశేషపాండిత్య మున్నట్లు తలఁపవలసియున్నది. కాని యీ "తెలుఁగు" గ్రంథములో సుమారు నాల్గవవంతు ఇంగ్లీషు వాక్యములకే తావీయఁబడుట లెస్సగాదని నామనవి.

సాధారణముగాఁ దెలుఁగుగ్రంథములను నిర్దుష్టముగా ముద్రించునలవాటు మనలో లేదు. ప్రతిగ్రంథము తుదిని తప్పొప్పులపట్టి తయారగును. కొన్నిటిలో నొప్పులే తప్పులుగా దిద్దఁబడినవి! ఈపుస్తకములో నట్టి దిద్దియుఁ గనఁబడ కుండుటచేఁ జాల సంతోషించితిని. పుస్తకము తెఱచిన పిదప మోసపోయితినని తెలిసికొంటిని. అచ్చుతప్పులే కాఁబోలు, పుటపుటలోను లెక్కలేనన్ని యున్నవి. ఈవఱకు వెలువడిన ముద్రణములలో నీస్ఖాలిత్యములను దిద్దకున్నను రాఁబోవు కూర్పులలోనైన గ్రంథకర్తగారు శ్రద్ధతో వానిని దొలఁగింతురని గంపెడాశతో నమ్ముచు వానిలోఁ గొన్నిటిని మాత్రమే యిట వ్రాయుచున్నాను.

దురూహ్యము, రాబోందు, తేజో కాలి, నభోసీమ, మేధస్సు, ప్రతీచీ యాచారములు, ప్రాచీన యాచారములు, మైత్రేయీగార్గీలు (మరల, మైత్రేయీలు గార్గీలు), గోయ్యఁగూర్చి, దురదృష్టవశాత్తూ హృదయమూ లేదు, అనఁగూడదూ?, కాదూ?, తేజోవంతమూ, పెద్దలూ పిన్నలూ, అనేది, అనేవారు, మనిషి, జ్ఞానజిజ్ఞాస, బాధకరమూ, పంచాయతు విధానమూ, ఇదంతా పెద్దలు చేసే పెద్దగొడవ......

సాహిత్యతత్త్వవిమర్శనము

ఇది యాంధ్ర విశ్వవిద్యాలయములో ౧౯-౩౮ వ సం॥ము బి. ఏ. పరీక్షకుఁ బఠనీయగ్రంథము ఇందులోఁ గూడ సారస్వతవ్యాసము లనేకము లున్నవి గాని 'విద్యార్థప్రకాశిక' లోవలెఁగాక విషయ మెక్కువగా నున్నది.

సాహితీహృది :

ఈవ్యాసములోనున్న విషయ మిది : "అచ్చుయంత్రములు, అక్షరములు — సాహిత్యము కావు. భావమును కడుపున నిముడ్చుకొన్న భాషయే సారస్వతము. కేవలభాషయే సారస్వతమనుట శరీరమే మనుజుఁడనుట. భావమునకు భాష యెట్లవసరమో, అట్లే సాహితికి మనుష్యజీవన మవసరము. కవికి అంతర్దృష్టి, యంతర్జ్ఞానము అత్యవసరము. ప్రకృతియందుఁ గవి తీక్ష్ణలక్ష్య ముంపవలెను. సహజసాహిత్యశక్తికి అక్షరములు సాధనములే కాని కారణములు గావు. ప్రకృతియు, కళయు; కళయు, మనుష్యజీవనమును; సైదోడులు. సాహిత్య మనుష్య జీవనములకు సత్యనిష్ఠయు, మహాలక్ష్యములును గావలెను. సత్యవిరుద్ధ విషయము లన్ని సారస్వతము లందును అక్కడక్కడఁ గలవు. ప్రాచీ ప్రతీచీ సారస్వత దృక్పథములో భేదము లున్నను ముఖ్యాంశములు సమానములే. హిందూసారస్వతమునకు మోమోట మెక్కువ, దుడుకుఁదనము తక్కువ. క్రైస్తవ సారస్వతము అమానుషములైన భయంకర ఘట్టములను గూడఁ జిత్రించును. ఉత్తమసారస్వతము నుత్తమజీవనము నుత్తమమతమును వేఱుచేయుట యసా

ధ్యము. దేశకాలములు మహాకవుల కడ్డుగోడలు గావు. వ్యాసాదులును షేక్స్పియరు ప్రభృతులును సత్యారాధకులే. వీరిమార్గములు భిన్నము లైనను గమ్యస్థాన మొక్కటే. షేక్స్పియరు భారత కవులవలెనే పూజ్యుఁడు." ఇందలివిషయము సత్యము, హృద్యము.

సారస్వతము ముక్తిసాధనము :

"భగవంతుఁడు మన హృదయములందే కలఁడు. మన యంతరంగమే దైవసామ్రాజ్యము. సద్భావమే దీని ద్వారము. బ్రహ్మానందప్రద మగు మోక్షప్రాప్తికి సేవ యుత్కృష్టసాధనము. సేవలన్నిటిలో సాహితీసేవ శ్రేష్ఠము. దైవసామ్రాజ్యములోఁ బరంజ్యోతి వెలుఁగుచున్నది. ఈజ్యోతిని గుర్తింపఁజేయు జ్యోతి సాహిత్యము. మనుష్య జీవనము సాహిత్యము. ప్రకృతియును, జీవనమును మిత్రములు. సారస్వతపట్టభద్రులు ప్రకృతిజనయిత్రి మధురదుగ్ధము లానినవారే. సేవయే భగవంతునకు మదావహమని మిల్టను చెప్పెను. కవి భావమయుఁడు. భావశక్తి యగ్నికంటెను తేజస్వంతమై, భౌతి కాధ్యాత్మిక ప్రపంచములకుఁ గారణ మై యున్నది."

సాహిత్యము ముక్తిసాధనము :

"ఉత్తమకవు లున్నతాదర్శములు చూపి మనుష్యులను స్వార్థచింతనుండి యుద్ధరించిరి. గీతాంజలి భక్తచింతామణికావ్యములు దైవమహిమమును గొనియాడి భక్తులను ముముక్షువులుగాఁ జేసి పవిత్రభావములను దశదిశల వెదఁజల్లినవి. రవి వసుకవు లిహమునందే ముక్తి నందిరి. భగవత్ప్రేరితకవిత్వమందు భగవత్స్వరూపము గోచరించును. కెయిడ్మన్, షేక్స్పియరు, బర్న్స్, రవీంద్రుఁడు వ్రాసిన గీతములు వారివి కావు. వీరి సాధనముగాఁ గొని కొండొకశక్తి వీరి ముఖములనుండి గంభీరముగా వాకొనుచున్నది. "పలికించెడువాఁడు రామభద్రుండఁట" యని పోతన యనలేదా? మిల్టను, స్పెన్సరు, సంబోధించిన విద్యాదేవత లెవరు? అకస్మికముగా మహోన్నతభావద్యుతి ప్రసరించుట యాధ్యాత్మికశక్తివలనఁ గాదా?"

పై రెండువ్యాసములును మనోరంజకములుగా నున్నను, గొంచెము వివాదాస్పదముగా నున్నవి. కాని రెండవదానిలో "ఐహికపునర్జీవనము, హృదయకోమలత్వము, భావోన్నతి, అనురాగప్రభావము, ఆధ్యాత్మిక శక్తి, మానసికోద్ధరణము, ముక్తి గాక మఱేమి?" అని యన్నప్పుడు "ముక్తి" కొంతవఱకు నిర్వచింపఁబడినది. సారస్వత సాహిత్యముల భేదము సరిగాఁ దెలుపఁబడలేదు; కొన్నిపట్ల రెంటికి ముడివెట్టఁబడినది. సారస్వతము కాలానుకూలమై ముక్తిదాయక మగుటకు ముందు, తాను ముక్తి పొందవలెననికూడఁ జెప్పఁబడినది.

సాహితిగోష్ఠి :

ఈవ్యాసములోని విషయ మిదిగో: "నేఁటి వాతావరణము భావబంధురము. ఇప్పుడు చూపట్టు క్రొత్త పోకడలు అంతరంగమునకు సంబంధించినవి గావు, భావవ్యక్తీకరణవిధానములోనివి. భావకవు లనువా రిప్పుడే పుట్టిరనుట భ్రమము. మనుష్యహృదయము, ప్రకృతి, దంపతులవలెఁ గలసికొన్నప్పుడు కల్గినది భావకవిత్వము. ఇట్టికవిత్వము నాఁడును గలదు, నేఁడును గలదు, రేపుగూడ నుండఁగలదు. ఇఁక విశేష మేమనఁగా, నట్టి భావకవుల సంఖ్యలో హెచ్చుతగ్గులే! అంతే! "భావకవిత" యనుపేరు "అగ్గినిప్పు" వంటిది. తెలుఁగులోఁ జక్కని గద్యరచన యింకను దలయెత్తలేదు. కారణ మేమి? మనకు గద్యమునెడఁ గల జుగుప్స (రోఁత)యే. రచనము రమ్యముగా నుండవలెఁ గాని మిఱ్ఱుపల్లములతో నిండియుండరాదు. సాహితికిఁ గావలసినది సౌకుమార్యము గాని కాఠిన్యము గాదు. వ్యాస (Essay) రచనముకంటెఁ గథారచనము సులభతరము. వ్యాసకర్త (Essayist) కు గభీరాలోచన కావలె. కథకునకు సహజశక్తి గావలె; పాండితితో నెక్కువ పని లేదు. వ్యాసపు వాక్కులు కలకండ ముక్కలు; కథావాక్కులో — పానకపు గ్రుక్కలు. పెద్దతల గలవారికి వలసినది వ్యాసము. విశాల హృదయమున్నవారికి వలసినది కథ. జనసామాన్యమునకు విద్యాభిరుచి గల్గింపవలెనన్నఁ గథారచన పెంపొందింపవలె."

ఈవ్యాసము హృదయంగమమై, "కలకండ ముక్కల"వలె నున్నది. భావకవితానిర్వచనము చక్కఁగానే యున్నది గాని భావకవు లొప్పుకొనరేమో? భావకవిత్వ మనునది విశిష్టమైన యొకరకపు కవిత్వ మని చెప్పి, "భావకవిత" యనుపేరు "అగ్గినిప్పు" వంటిదని యనుట సమంజసము గాదు. ఇట్టి విశిష్టకవిత్వమును గూడ 'కవిత్వ' మను సాధారణనామముతోనే పిలువవలెనా? గుర్తుకొఱకు "భావకవిత" యని యనఁ గూడదా? లేకున్న నెట్టిపే రుండఁదగును?

శైలి:

"శైలికలహ మొక్క యాంధ్రావనిలోనే యున్నది. జిజ్ఞాసతోడి దృష్టియే ఫలవంతము. జిజ్ఞాసలేని చూపు వట్టిచూపు. ఆంధ్రులం దీజిజ్ఞాస చల్లవడి యుండుటచే వీరు భాషాహృది నంతగా నెఱుఁగ లేకున్నారు. వీరు భాషావ్యాయామము చేసిన మల్లులు. కేవలము శుష్కమైన గ్రామ్యగ్రాంథిక కలహము చూఁడగా, సంధి కుదురు చిహ్నలు కానవచ్చుట లేదు. నిరంకుశత్వము రాజులను, రాజ్యములను, భాషాచక్రవర్తులను గూల్చును. సాహిత్యవృద్ధినిరోధకము లగు మితిమీఱిన నిబంధనములు పెరిఁగినప్పుడు నిరంకుశత్వము తల యెత్తును. ఎవరికి వారే రాజులైనచో విప్లవము పుట్టునట్లే, యెవరికి వారు భాషాశాసకులైనచో భాషావిప్లవము తప్పదు. కాని నిరంకుశత్వ మెట్లనర్థదాయకమో నియమరహితాచరణముగూడ నట్లే యనర్థదాయకము. అవసరము లైన నియమము లుండవలెను. విచ్చలవిడిగాఁ బ్రాఁగుఁబోతులవలె గంతులు వేయుట స్వాతంత్ర్య మనిపించుకొనదు. భావకు వ్యాకరణసూత్రము లవసరములే. కాని యవి యురిత్రాళ్లవలెను, సంకెళ్లవలెను గాక యనురాగసూత్రములవలెను, భూషణములవలెను సొంపుగూర్చుచుండవలెను. అన్యదేశ్యపదములను యథోచితముగా వాడుట తప్పుగాదు.

భావము ననుసరించి భాష యుండును. యుద్ధరంగమును, క్రౌర్యమును వర్ణించుపదములు చల్లని కరటములను, పుష్పరమణీయతను వర్ణించుటకుఁ దగవు. ప్రకృతియందలి భేదమే భావమందలి భేదమై శైలియందలి భేదమగును. విషయప్రకృతి తదనుకూలమైన మనుష్యప్రకృతియందే యిముడును. అట్లు గాక, రాధాకృష్ణుఁడు భౌతికశాస్త్రమును, రామన్ తత్త్వశాస్త్రమును బరిశీలించినచో నేఁ డిరువురును పేరువులై యుండెడివారా? కారు; అణువులై యే మూలనో యుండెడివారు. విభిన్నప్రకృతులు గల కూల్రిడ్జి, వర్డ్స్‌వర్తు, షెల్లీ, బైరన్, కదేల శైలులు విభిన్నములు. తెంపులనుబట్టి శైలి మాఱును. వ్యక్తి యొక్కఁడైనను విషయమును బట్టి శైలి మాఱును. ప్రకృతి విభూతిని గ్రహించుటలో కాళిదాసుఁడు షెల్లీనేకాక షేక్స్పియరును గూడ మించెను. అగాధయోచన, గభీరతత్త్వము భారతీయుని లక్షణములు: రవీంద్రుఁడు భారతీయుఁడు, మహర్షి పుత్త్రుఁడు.

కళోపాసకుఁడు జగదీశు నంతవాఁడు. సృష్టియందలి లోపములను కళాసక్తుఁడు దిద్దఁజూచును. భాషాప్రపంచములోఁ గూలి నాలి చేసికొని బ్రదుకువారు కళోపాధ్యాయులు గారు. సాహితీపరులు కళోపాసకులే. వీ రాకాశవీథి నెగురక, తోడివారి యభ్యుదయమును దృష్టియం దుంచుకొని సరళభాషలో వ్రాయఁదగును."

ఇందలి విషయములు కొన్ని నాకుఁ బరమసత్యములుగాఁ గాన్పించుచున్నవి. గ్రంథకర్తగారు చెప్పుచున్న విషయమును వదలి కలము దూరము పోయినారు. వీరు తెలుఁగుసాహిత్యమును వృద్ధిచేయు నభిలాషము గలవారు గాన, ఉపమానములను బహుళముగాఁ దెలుఁగుసారస్వతమునుండి, కొలఁదిగా నింగ్లీషు, హిందీ, బెంగాలి సారస్వతములనుండి తెచ్చుకొనుట ప్రయోజనకారి. అంతే కాని వ్యాసములో మూఁడవవంతు అన్యసారస్వత మాక్రమించుట న్యాయ్యము గాదని నామనవి.

గ్రాంథిక గ్రామ్యములలో వీరి కేది యిష్టమో సరిగాఁ జెప్పక వీరిమాటలు కోమటిసాక్ష్యమునకు జ్ఞాపకముగా నున్నవి. వీరు స్వయముగా సరళభాష

(వ్రాయుచున్నను) అన్యదేశ్యములకుఁ గూడ గతి కల్పించి కొలఁదిసంస్కరణ మపేక్షించు సరళ గ్రాంథి కాంధ్ర భాషాపరులని నే నూహించుచున్నాను. నాయూహ భ్రమజనితమే కావచ్చును.

భావావేశము :

ఇది యేసమాసమో నాకు స్పష్టముకాలేదు. దీనియర్థము — ఆవేశమువలని భావన యనియా? భావనవలని యావేశ మనియా? భావన యను నావేశ మనియా? భావనతోడి యావేశమనియా? ఇందులో నేది? ఏదియుఁ గాకున్న మఱేమి?

శీర్షిక కర్థ మెట్లున్నను వ్యాసమునందలి విషయ మున్నతమైనది. పరమ సత్యవాక్యము లనేక మీవ్యాసములో నున్నవి, చూడుఁడు.

“రసబంధుర హృదయమునుండి సౌందర్యమును గురిపించునది భావనావేశము. ఇది యమేయశక్తిమంతము. ప్రకృతినుండి కవి హృదయములోనికిని, కవి హృదయమునుండి ప్రకృతిలోనికిని అదృశ్యతరంగిణి వలె భావనావేశము ప్రవహించును. దీని వీచికలందే రెండును గలిసికొనును. వరునిఁ జూచి మోహిత యగు వధువువలె, కవినిగాంచి ప్రకృతి హృదయము విప్పి తన సౌందర్యము నాతనివశ మొనర్చును. కవిహృదయములో నానంద శృంగారాదుల నూరించు సద్యశ్శక్తి భావనావేశమే. ఇది మేధశ్శిఖమునఁ బుట్టునది గాదు. మఱి, హృదయమహోదధిలో జనించును. ఇంకొక విశేషము. కవిత్వము కొందఱకు మాత్రమే—మనుజులకే సుండీ! — హృదయరంజక మగును. గానమో, మానవులకు, మృగములకు, దేవతలకు, రాక్షసులకు, నొక్కే భాషగా నుండఁగలది.”

భావనము, పరిశీలనము :

“సాహితికి భావన మాయువు; పరిశీలనము పోషకము. పరిశీలనము పైచూపుగలది; భావనము లోచూపు గలది. కాని, శాస్త్రజ్ఞునిదృష్టి వేఱు, కవిదృష్టి వేఱు. ఇద్దఱి పరిశీలనములే వేఱు, ఇద్దఱిసిద్ధాంతములే వేఱు.” — ఇందలి వస్తువు రమ్యము.

మాతృభాష :

“మాతృభాషకుఁ బ్రాముఖ్య మీయవలెను. రవీంద్రుఁడు తఱచుగా మాతృభాషాగౌరవ మత్యవసర మని చెప్పుచుండును. అఱువదేండ్లకు మున్ను ఊరు పేరు లేని వంగభాష నేఁడు దివ్యసింహాసన మధిష్ఠించినది. మంజులమైన మనభాష Italian of the East అని ప్రసిద్ధినందినది. ఆంధ్రసాహిత్యము పునరుద్ధరింపఁబడవలె ననిన, భాషావిప్లవము తప్పదు. భాషాప్రవాహమున కానకట్టయై వ్యాకరణ ముండెనేని దానిని దెగఁగొట్టుట కాలసింపరాదు.”

నిజమే, శుభస్య శీఘ్రమ్!

నేఁటి వాఙ్మయోద్యమము :

లో నిట్లున్నది: “భాష శుద్ధశ్రోత్రియముగా నుండవలెనని మడిగట్టుకొన్న పండితు లనుచున్నారు. ఎంతచక్కని చుక్కలైన నేండ్లు గడచినతరువాత అవ్వ యగునని యెఱుఁగక యీపితామహులు వీథిని బడుచున్నారు. గ్రాంథికవాదులును, గ్రామ్యవాదులును, స్వతంత్రవాదులును యుద్ధము చాలించి, సంధి చేసికొని “అఖిలాంధ్ర సాహితీ సభ” యొకటి యేర్పఱిచి భాయి భాయీ యనుచుఁ గలిసికోవలెను. కావున శీఘ్రముగా సాహితీయోధు లందఱుఁ దమరథములను గిడుగుమహోపాధ్యాయుని వెంట నడపుదురు గాక.”

మార్గదర్శయితలైన గిడుగువారివెంట రథములం దోలుఁడని సాహితీయోధుల కందఱకు సలహాయిచ్చిన గ్రంథకర్త గారు “పట్టాభిషేక మందిన పాదుక” భావయే నిజముగాఁ దమకు నచ్చినచో, తమరథమును గూడ నాదిక్కునకే పోనీయరేమి? యోధులనందఱను దారికిఁబట్టించి తాము కడపటఁ బోఁదలఁచిరిగాఁబోలు. లేకున్న, వీరు నిన్నగాక మొన్న వ్రాసిన “విద్యార్థి ప్రకాశిక”ను గూడఁ దమకుఁ బెట్టని సొమ్మైన గడబిడ గ్రాంథికములోనే వ్రాసినారేల? వీరి యంతరంగము దురూహముగా నున్నదే!

లలితకళలు - నవ్య కెరటాలు :

కళలలో హాస్యరసము కూడఁ బోషింపఁబడవలె నని యుందున్నది.

విమర్శనము - లలితకళాభ్యుదయము :

"విమర్శకుఁడు విజ్ఞానియై విశాలదృష్టి గల్గి యుండవలెను. విమర్శనము సాహితీ స్పందనమును విధ్వంసము చేయక దానికి జీవకళ నిచ్చి ముందటికి సాగింపవలెను." ఇందలి కొన్ని వాక్యములు "దీనిభావ మేమి తిరుమలేశ" యన్నట్లున్నవి.

నాట్యకళ - సంస్కరణము :

"నాటకమునకు సంబంధించినవారు ముగ్గురు: రచయిత, నటుఁడు, ప్రేక్షకుఁడు. నటునికి పవ జశక్తి, పాండితి, సద్వర్తనము కావలెను. ప్రేక్షకు లందఱును విమర్శకదృష్టి గలవా రని తలఁపరాదు. నేఁడు విజయ ధ్వానములతోఁ బ్రదర్శింపఁబడు నాటకము లన్నియు నాదర్శనాటకము లని తలఁచుట పొరపాటు. లలిత కళల కన్నిటికిని నాటకమునఁ గొంత చోటున్నది. నాటకకర్త లలితకళారాధకుఁడై, లోకజ్ఞుఁడై మన శాస్త్రపరిజ్ఞాతయై, Stage technique బాగుగాఁ దెలిసినవాఁడై యుండవలెను.

నాట్యకళ సంఘమునకు సంబంధించినది. సంఘసంస్కరణమునకు సత్యాన్వేషణ మవసరము. ప్రత్యక్ష ప్రపంచము నెదుట నద్దము నిలుపుట నాటకకర్త పని. అతఁ డత్యుక్తులకు, నూహాతీత సంఘటనము లకుఁ దావీయరాదు; భావముల సంఘర్షణములో నుత్తమభావవిజయము చిత్రింపవలెను.

మనము నాటకలక్షణములను శ్రద్ధతో గమనింప వలయును. తెలుఁగులో నాదర్శనాటక మొక్కటి కూడ నింతవఱకు లేదు."

గ్రంథకర్తగారు తరవాతి వ్యాసములో ద్విజేంద్రలాల్ రాయ్‌గారి రచనమే నాటకరచనలో మేలుబంతి యని చెప్పి, తా మనువదించిన రాయ్‌గారి "షాజహాను" అను నాటకమునుండి మచ్చునకై కొన్ని తునకలు చూపించినారు; స్వీయదేశ సాహిత్య సంప్రదాయములు గమనించుచు, నవసరమగుపట్ల, నవ్యసాహితీ నవ్యవిధానముల నాదరించి, కాలప్రవంతి ననుగమించుట నాటకకర్తల పనియని కూడ హెచ్చరించి యున్నారు.

"విద్యార్థిప్రకాశిక"లోవలెనే యీ గ్రంథమందును శుద్ధపత్రము లేకున్నను దుస్సహములైన తప్పులు మాత్రము కుప్పతెప్పలుగాఁ జేరి తీఱినవి. ఎందఱో జనులు - విశేషించి విద్యార్థులు - చదువుకొనవలసిన గ్రంథము గదా యిది, యిన్ని తప్పు లుండిన బాగుండునా? ఎట్టి తప్పు లున్నవో యివిగో చూడుఁడు:

చేయికి పైనఁ గలదు, కవులు, హిందూ ఆచారములు, కన్నును ఆకర్షించి, ముందులకు, భావకవిత వొకటీ అభావకవిత కొక్కటీ, ఆలసదనము, ఊరకొనుట, దానినంతను, గంతులేయు, మేధస్సు, అందించినది కాళిదాసు.........ఎన్ని యని చెప్పఁగలను?

వీనితోపాటు, పైరెండు గ్రంథములలోను "అమ్మరొమ్మ", "గిటేగంతలో కాళిదాసున్నాఁడు" "బోడిమాటలు," "షెల్లీకవి" మొదలగు నశ్లీలములును, "అవ్వల," "అక్కలు," "జగద్ధాత్రి" "తోఁచుట (కన్పడుట)" "భారతావని," "మేధస్సు," "రంగారు బంగారు," "బలాదూరు" మొదలగు నలవాటు మాటలును గలవు. శుభముగా వాల్గుమక్కలలోఁ జక్కఁగాఁ జెప్పఁదగిన విషయములు పెక్కు వింత మాటలతో డొంకతిరుగుడుగాఁ జెప్పఁబడినవి. పై పెచ్చు, పద్యములోఁ గూడ నుపేక్షింపఁదగని యయోమయత్వము గద్యములోఁ దఱచుగా నుండుట శోచనీయము. అతిశయోక్తులు మితిమీఱుటచే నందము చెడినది. ఇఁక — References! అన్యతరోన్య, యీపేరెత్తఁగానే భయమగుచున్నది. గ్రంథకర్తగా రెన్ని పుస్తకములు Refer చేసినారో చూచినారా? అడుగడుగునకు,—Vide X's (English) Works, Vide Y's (Bengali) Works, Vide Z's (Pali) Works... ఇట్టి విచిత్రపు References చాలక, యొకమాఱు (సాహిత్యతత్త్వవిమర్శనము— ౧౭౨ వ పుట) "ఉత్తమప్రతీచీసాహితిని ప్రవేశించి చూడుఁ" డని సలహా యిచ్చినారు. ఇంతే కాదు, మఱియొకచోట నిదే మదే మని (సా. విమర్శనము— ౧౬౪ వ పుట) "ప్రపంచసాహిత్యము తెలిసి చూడఁ" డని చదు

వరులకు వద్యోగ చేసినారు. Refer చేయుట దోషమని నేను జెప్పుటలేదు గాని కొలఁది గ్రంథములు పేర్కొన్నఁ జాలు నని మాత్రము విన్నవించుకొనుచున్నాను.

ఈ రెండు గ్రంథములలోను, — విశేషించి సాహిత్యతత్త్వవిమర్శనములో — మహావాక్యము లనఁ దగినవి పెక్కున్నవి. సత్యాతిసత్యము లై హృదయంగమములైన పలుకులు చాలఁ గలవు. వస్తువు మహోత్కృష్టము. కాని యీగుణములన్నియు నీ తికమక భావములో "నివురు గప్పిన నిప్పు" వలె నున్నవి. "సాహిత్యతత్త్వ విమర్శనము" విమర్శగ్రంథములలో నగ్రగణ్యమని చెప్పలేను గాని యిప్పు డున్న యుత్తమ విమర్శగ్రంథములలో నొకటి యనియు, సత్యశక్తిని వ్రాయఁబడిన దనియుఁ జెప్పుటకు సందేహింపను. ఎక్కువ కఠినపదములు లేకుండ, భావములను క్లిష్టమొనరీయక, తిన్నగా, సులువుగా, సమర్థములైన కొలఁదిమాటలతోఁ జెప్పివైచినచో నీగ్రంథ ముత్కృష్టమై యుండెడిది. గ్రంథకర్తగా రింగ్లీషులోఁ గూడ సారస్వతవ్యాసములు వ్రాసి విద్యార్థులకుఁ, దదితరులకు మేలు చేయుదురని నమ్ముచున్నాను.

ఇంతవరకు నేను జేసినది విమర్శలేశమే. చే నీ విమర్శనము మనఃపూర్వకముగాఁ జేసితి నని తలఁతును. ఆంధ్రసాహిత్యపరు లీరెండు గ్రంథములను జదివి, విషయములు బాగుగాఁ దెలిసికొని, నా యీచిన్ని విమర్శమందలి మంచిచెబ్బరలు విచారింతురు గాక. నాయభిప్రాయములు తప్పు లైనచో, నడఁకువతో సవరించుకొందును. నా వ్రాఁత గ్రంథకర్తగారికిని, మఱికొందఱకును నొప్పి కలుగఁజేసినచో క్షంతవ్యుఁడను. ప్రియమైన యసత్యము చెప్పుటకంటె నప్రియమైనసత్యము చెప్పుటే మంచిదని తలఁచి యట్లు చేయఁ బ్రయత్నించితిని.